# నిర్దేశించిన సమయానికి కాకపోయినా?

నిర్దేశించిన సమయానికి కాకపోయినా
అక్కడ గడియారం
రైలు గంటయి మోగుతుంది
అప్పటికప్పుడు –
బడిలోని మొదటి గంట ఆఖరు గంట
రెండూ ఏకమైన వాతావరణం
అంతటా అలుముకుంటుంది
ఎక్కడెక్కడివో కొన్ని వందల ఊళ్లు దిగుతాయి
పట్టుకు వేళ్లాడిన కొన్ని వందల వేళ్లు పుటుక్కున తెగుతాయి
వేరు పడ్డ వేళ్ల జేబురుమాళ్లు
అదేపనిగా తడుస్తుంటాయి
కనిపించని ముఖాల వెతుకులాటలో
కొన్ని కాళ్లు ఇటూ అటూ పరిగెడుతుంటాయి
ఒళ్లంతా మరకలు మరకలైన గ్లాసులు
వేడి వేడి అరుపులై తిరుగుతుంటాయి

ఆవురావురు మంటున్న పేగులు
తినుబండారాల చుట్టూ చేతులు చాస్తుంటాయి
తిని పారేసిన పొట్లాల కోసం
ఎక్కడెక్కడి నుండో
లోతుకుపోయిన కళ్లు రెప్పలార్పకుండా చూస్తుంటాయి
బండెక్కలేమనుకుంటున్న ఆదుర్దాలని
ఆటోలు డబ్బులు చేసుకుంటుంటాయి

కండక్టరు చుట్టూ తిరిగే నోట్లు
చార్టులోని ఖాళీలని పూరిస్తుంటాయి

ఎలాగో ఎక్కగల్గితే చాలనుకున్న శాల్తీలు
పడుకునే ఏర్పాట్ల పరుగులో పాకుతుంటాయి

నింపుకున్న జేబులు చల్లగా జారుకుంటాయి
దొంగ వెధవలా కనిపించిన
వీపుల్ని బాదుతుంటాయి
పచ్చ జండాలకి
ఇవేవీ పట్టనట్టు కాస్సేపటికి ఊగుతాయి
అప్పటికప్పుడు మళ్లీ
బడిలోని ఆఖరుగంట ఎప్పుడో అయిపోయినట్టు
మొదటి గంట ఎప్పటికో అవుతుందన్నట్టు
వాతావరణం మారిపోతుంది
రాత్రి పగలూ లేని నిరంతర యాత్రలో
అన్నీ అనుకున్నట్టుగానే సాగకపోయినా
ప్రతీచోటా ప్రదర్శన అదే
పాత్రలూ చాలా వరకూ అవే
మారేది పాత్రధారులే!